సాక్షి
పల్నాడు
మంగళవారం । 31 । డిసెంబర్ । 2024




హుండీ ఆదాయం రూ.12,44,454

మంగళగిరి: స్థానిక గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.12,44,454 సమకూరింది. సోమవారం హుండీ లెక్కించిన అధికారులు వివరాలు వెల్లడించారు.



భవానీ దీక్షల హుండీ ఆదాయం

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ అనంతరం హుండీల ద్వారా వచ్చిన కానుకలను సోమవారం లెక్కించారు. రూ.2.70 కోట్ల మేర ఆదాయం సమకూరింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 571.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,144 క్యూసెక్కులు విడుదలవుతోంది.

మోసబుద్ధి చూపింఛెన్!

కూటమి సర్కారు దగా

- అనర్హత పేరుతో పెన్షన్లలో కోత
- ఆరు నెలల్లో జిల్లా వ్యాప్తంగా 8,596 మంది లబ్ధిదారుల తగ్గుదల
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏడాదికి రెండుసార్లు కొత్త పింఛన్ల మంజూరు
- నేడు జిల్లాకు సీఎం నారా చంద్రబాబు



అర్హత ఉన్నా పింఛన్ నిలిపివేశారని ఈ నెల 2న శావల్యాపురం మండలం ఎంపీడీఓను కలవడానికి వచ్చిన కనమర్లపూడి గ్రామానికి చెందిన పింఛన్‌దారులు

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 50 ఏళ్ల దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలలో అర్హతున్న వారందరికీ వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వాగ్దానం చేశారు. కూటమి మేనిఫెస్టోలోనూ పొందుపరిచారు. అయితే కూటమి అధికారం చేపట్టి ఆరునెలలైనా ఇప్పటివరకు ఒక్క పింఛన్‌ను కూడా చంద్రబాబు సర్కారు మంజూరు చేయలేదు. పైగా అనర్హత పేరుతో ఉన్న పింఛన్లకు కోత విధిస్తోంది. ఫలితంగా పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆశ పడి భంగపడ్డామని విలపిస్తున్నారు. జిల్లాలో కొత్తగా పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న వారు రెండులక్షల మందికి పైగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే వీరికి పింఛన్లు మంజూరు చేస్తే ఒక్కొక్కరికి రూ.4వేలు చొప్పున ఆరునెలలకు రూ.24 వేలు లబ్ధి చేకూరి ఉండేది. దీంతో ఇప్పటికైనా పింఛన్ మంజూరు చేయాలని ఆశావహులు కోరుతున్నారు. మంగళవారం పింఛన్ల పంపిణీ నిమిత్తం నరసరావుపేటకు వస్తున్న సీఎం చంద్రబాబు దీనిపై విస్పష్ట హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆరు నెలల్లో 8,596 పింఛన్ల తగ్గుదల

అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఉన్న పింఛన్లకు కూటమి సర్కారు మంగళం పాడుతోంది. అనర్హుల ఏరివేత పేరిట టీడీపీకి ఓటేయని వారందరినీ నాయకులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఏకంగా గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన సామాజిక పెన్షన్లకూ నోటీసులు జారీ చేసి అర్హత నిరూపించుకోవాలని, లేకపోతే అనర్హులుగా ప్రకటిస్తామని రీవెరిఫికేషన్ పేరిట ఎంపీడీఓలతో నోటీసులిప్పిస్తున్నారు. టీడీపీ నేతలు తమ పరిధిలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల జాబితాలు అందజేస్తే వారందరికీ అధికారులు నోటీసులు అందజేస్తున్నారు. ఒంటరి మహిళలకు నోటీసులు ఇచ్చి తహసీల్దార్ ద్వారా ధ్రువీకరణపొంది ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలని నోటీసులు అందజేశారు. అలాగే దివ్యాంగులకు మరోసారి వైద్యుల నుంచి సర్టిఫికెట్ తీసుకొని సమర్పించాలని అడుగుతున్నారు. ఇలా గతంలో ఎన్నడూ లేని విధంగా నోటీసులు ఇవ్వడంపై ప్రజలు, ప్రజా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నారా చంద్రబాబునాయుడు సీఎంగా బాధ్యతలు స్వీకరించే నాటికి 2,82,126 మంది పింఛన్ లబ్ధిదారులు ఉంటే ఈ ఏడాది డిసెంబరు వచ్చేసరికి ఆ సంఖ్య 2,74,209 మందికి చేరింది. తాజాగా ఈనెలలో 679 మంది తగ్గారు. 2,73, 530 మందికి మాత్రమే జనవరి నెల పింఛన్‌ను సర్కారు అందజేయనుంది. గత ఆరు నెలల వ్యవధిలో మొత్తం 8,596 పింఛన్లు తగ్గడం గమనార్హం. చనిపోయిన వారిని తీసేసినా ఈ స్థాయిలో పింఛన్లు తగ్గే అవకాశం లేదని అధికారులే చెబుతున్నారు.

కొత్త ఫింఛన్లు రావు.. ఉన్నవి ఇవ్వరు

పల్నాడు జిల్లాలో ఈ ఏడాది జూలై నుంచి తగ్గుతూ వస్తున్న పింఛన్ల సంఖ్య ఇలా..

నియోజకవర్గం	జూలై	నవంబరు	డిసెంబరు	జనవరి
చిలకలూరిపేట	37,982	37,090	36,984	36,900
గురజాల	44,026	42,921	42793	42,675
మాచర్ల	43,520	42,370	42,217	42.099
నరసరావుపేట	33,622	32,824	32,719	32,666
పెదకూరపాడు	40,264	39,248	39,117	39,020
సత్తెనపల్లి	40,559	39,538	39,427	39,340
వినుకొండ	42,153	41,079	40,952	40,830
మొత్తం	2,82,126	2,75,070	2,74,209	2,73,530

నాకు అర్హతుంది పింఛన్ ఎప్పుడిస్తారు?



బీసీ వర్గానికి చెందిన నేను టైలర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. పోయిన ఎన్నికల్లో చంద్రబాబు 50 ఏళ్ల నిండిన బీసీలకు వృద్ధాప్య పింఛన్ మంజూరుచేస్తామని హామీనిచ్చారు. పేదరికంలో ఉన్న మా లాంటివారు ఆ పింఛన్ కోసం ఎదురుచూస్తున్నాం. చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకొని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయం చేయాల్సిందిగా కోరుతున్నాను.

– దూదేకుల పెద మదార్‌సాబ్, టైలర్, శావల్యాపురం

కొత్త పింఛన్లు ఏవీ..?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏడాదిలో రెండుసార్లు కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. అర్హతే ప్రామాణికంగా ఏటా జనవరి, జూలై నెల్లలో ఎటువంటి సిఫార్సు లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరిగేది. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే ఎక్కడికీ వెళ్లాల్సిన పనిలేకుండా, ఎవర్నీ కలవాల్సిన అవసరం లేకుండా పింఛన్‌కు అర్హత సాధించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జిల్లాలో ఒక్కటంటే ఒక్క పింఛన్‌నూ మంజూరు చేయలేదు. అన్ని అర్హతలూ ఉండి ప్రభుత్వం కొత్త పింఛన్లను మంజూరు చేయకపోవడంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. కనీసం ఎప్పుడు కొత్త పింఛన్లు మంజూరు చేస్తారో కూడా చెప్పలేని దుస్థితి నెలకొనడంతో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు గ్రామ, వార్డు సచివాలయాలు, మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని కోరుతున్నారు. అయినా సర్కారు కరుణించడం లేదు.

సోషల్ మీడియా యాక్టివిస్ట్‌కు ఎస్సై బెదిరింపులు

నరసరావుపేట: చిలకలూరిపేటకు చెందిన సోషల్ మీడియా యాక్టివిస్ట్ జేరెడ్డి శివకుమార్ రెడ్డిపై నాదెండ్ల ఎస్సై జి.పుల్లారావు బెదిరింపులకు పాల్పడ్డారు. పల్నాడు జిల్లా గణపవరం గ్రామానికి చెందిన శివకుమార్‌రెడ్డి రోజూ ఓ ప్రైవేటు కంపెనీలో కూలి పనులకు వెళ్తుంటారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించిన విషయం తెలిసిందే. దీనిపై చిలకలూరిపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి విడదల రజిని చేసిన ఆందోళన కార్యక్రమాలు విజయవంతమయ్యాయంటూ శివకుమార్‌రెడ్డి తన సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ చేస్తూ సీఎం చంద్రబాబు ఫొటో జత చేశారు. దీనిపై ఎస్సై జి.పుల్లారావు శివకుమార్‌రెడ్డికి ఫోన్ చేసి బెదిరించారు. నువ్వు వెంటనే స్టేషన్‌కు రావాలని, లేకుంటే తానే వచ్చి స్టేషన్‌కు లాక్కెళ్తానంటూ ఫోన్‌లో బెదిరించారు. సాయంత్రం పోలీసులు వచ్చి గణపవరం బజారులో ఉన్న శివకుమార్‌రెడ్డిని జీపులో ఎక్కించుకుని వెళ్లారు.

ఆకర్షణీయంగా వేంకటేశ్వరస్వామి నామాలు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో విజయకీలాద్రి పర్వతంపై ఏర్పాటు చేసిన వెంకటేశ్వరస్వామి నామాలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. సోమవారం రాత్రి తాడేపల్లి పట్టణ పరిధితోపాటు, చుట్టుపక్కల ప్రాంతాల్లో కనిపించేలా త్రిదండి చినజీయర్ స్వామి ఆశ్రమ నిర్వాహకులు రెండువైపులా నామాలతో వెంకటేశ్వరస్వామి నామాలు ఏర్పాటు చేశారు. ఈ నామాలు చుట్టుపక్కల ప్రజలకు కనిపించడంతో ప్రజలు భక్తితో తరించారు.

న్యూస్‌రీల్

రెడ్డిపేరంటాలమ్మ ఆలయానికి రూ.5,01,116 విరాళం



నాదెండ్ల: సాతులూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న రెడ్డిపేరంటాలమ్మ ఆలయానికి గుంటూరుకు చెందిన జెట్టి ఉమాశంకరరావు, పావని దంపతులు రూ.5,01,116 నగదు విరాళంగా సోమవారం అందజేశారు. పురాతన చరిత్ర గలిగిన ఈ ఆలయాన్ని గతేడాది రూ.2 కోట్ల వ్యయంతో జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. ఆలయ నిర్మాణ పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి. 2025 మార్చి 17న ఆలయంలో ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వజ్జా వీరాంజనేయులు తెలిపారు. ఆలయ నిర్మాణ కార్యక్రమానికి ఆర్థిక సాయం అందించిన ఉమాశంకరరావు దంపతులను కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జంపని లక్ష్మీనారాయణ, వజ్జా రామారావు, సీహెచ్ వెంకట సుబ్బారావు, కమ్మ సీతయ్య, వజ్జా శ్రీనివాసరావు, వెంకటరావు, గొర్రె సాంబశివరావు, నర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పీఈటీల సంఘ జిల్లా అధ్యక్షునిగా స్వర్ణరాజు

కారెంపూడి: ఏపీటీఎఫ్ (పీఈటీ), ఎస్ఏ (పీఈటీ)ల జిల్లా సంఘ అధ్యక్షుడిగా కారెంపూడి బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్ పీఈటీ బీవీ స్వర్ణరాజు ఎన్నికయ్యారు. మండల వ్యాయామ ఉపాధ్యాయులు సోమవారం ఆయనకు అభినందనలు తెలుపుతూ సన్మానించారు. గత ఆదివారం నరసరావుపేటలో జరిగిన పీఈటీల జిల్లా సమావేశంలో స్వర్ణరాజు జిల్లా అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పి ఖాదర్ మస్తాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై పీఈటీలు హర్షం వ్యక్తం చేశారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ



తాడేపల్లిరూరల్ (మంగళగిరి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ కళాశాలలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఆచార్య వి.దివ్యతేజోమూర్తి మాట్లాడుతూ సామాజిక రుగ్మతలు రూపుమాపేందుకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా బాల్య వివాహ రహిత దేశంగా భారత్‌ను నిలిపే క్రమంలో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్కిటెక్చర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆచార్య కెవి నిరుపమ, అధ్యాపకులు డాక్టర్ షకీలా నూర్ బాషా, ఝాన్సీ, ఉషాకిరణ్, స్వప్న, చంద్రమోహన్, ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మంగళగిరి: ఎర్రచందనం వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని పలువురు వ్యాపారులు కోరారు. స్థానిక ఆటోనగర్‌లోని అటవీ శాఖ కార్యాలయంలో అటవీశాఖ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరిని కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎస్.రవిరాజు, సెక్రటరీ నాగయ్య, జాయింట్ సెక్రటరీ కొండేటి ఆంజనేయులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీటీఎఫ్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీతో పాటు గతేడాది కాలంలో విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వులతో కూడిన జీవో పుస్తకాన్ని పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం వారి కార్యాలయాల్లో వేర్వేరుగా ఆవిష్కరించారు. ఉపాధ్యాయులందరికీ ఉపయుక్తంగా ఉండే విధంగా రూపొందించినట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, ఎండీ ఖాలీద్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు పి.నాగశివన్నారాయణ, పి.లక్ష్మీనారాయణ, కె.రమేష్, పి.పార్వతి, ఎస్ఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

గత హామీలు మరచి'నారా సారూ'!



జేఎన్‌టీయూఎన్ కళాశాలలో నిలిచిన బాలుర వసతిగృహం పనులు

- 2016లో సీఎం హోదాలో జేఎన్‌టీయూఎన్ నిర్మాణాలకు శంకుస్థాపన
- మూడేళ్లలో కాంపౌండ్ వాల్ కూడా నిర్మించని అప్పటి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.100 కోట్లతో నిర్మాణ పనులు
- కూటమి ప్రభుత్వంలో ఆరు నెలలుగా నిలిచిన నిర్మాణాలు
- కోటప్పకొండ రోప్‌వేకు 2016లో శంకుస్థాపన
- నేటికీ అందుబాటులోకి రాని వైనం



కోటప్పకొండలో నిలిచిన రోప్‌వే పనులు

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూఎన్ కళాశాల భవన నిర్మాణాల పనులకు చంద్రగ్రహణం పట్టింది. గత ఐదేళ్లుగా నిర్మాణ పనులు పరుగులెత్తగా ఆరు నెలలుగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. 2016లో టీడీపీ ప్రభుత్వ హయాంలో కళాశాల భవన నిర్మాణ పనులకు అప్పటి సీఎం చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. వేగంగా పనులు పూర్తిచేస్తామని చెప్పి రూ.2.5 కోట్లతో చేపట్టిన కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులనూ అప్పటి ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కాంపౌండ్‌వాల్‌తోపాటు రూ.31 కోట్లతో మూడు అకడమిక్ బ్లాక్‌లు, రూ.17 కోట్లతో అంతర్గత రోడ్ల పనులు పూర్తిచేశారు. దీంతోపాటు రూ.32 కోట్లతో మహిళలు, పురుషుల వసతి గృహాల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ ఏడాది ఏప్రియల్‌కు రెండు బ్లాక్‌ల నిర్మాణాలు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వసతి గృహాల నిర్మాణాలు నిలిచిపోయాయి. దీంతో పాటు రూ.16 కోట్లతో చేపట్టిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

రోప్‌వే గుర్తుందా..!

కోటప్పకొండను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, ఇందులో భాగంగా రోప్‌వేను ఏర్పాటు చేస్తున్నట్టు చంద్రబాబు 2016లో ప్రకటించారు. కోటప్పకొండ దిగువన నల్లచెరువు వద్ద నుంచి కొండపైకి యాత్రికులు చేరుకునే విధంగా రోప్‌వేను నిర్మించే పనులకు 2016లో సీఎం హోదాలో చంద్రబాబు శంకుస్థాపన చేశారు. పీపీపీ పద్ధతిలో పలు సంస్థలు రోప్‌వే ఏర్పాటుకు ముందుకు వచ్చినా టీడీపీ నాయకుల కమీషన్లకు భయపడి ప్రారంభించిన పనులు మధ్యలోనే నిలిపివేసి వెళ్లిపోయారు. ఇప్పుడు మరోసారి సీఎం హోదాలో కోటప్పకొండలో చంద్రబాబు పర్యటించనున్నారు. రోప్‌వే నిర్మాణంపై చంద్రబాబు స్పష్టమైన హామీ ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు.

వీటి సంగతేంటి?

ఆటోనగర్ ఏర్పాటు సమస్య నరసరావుపేట పట్టణంలో దీర్ఘకాలంగా ఉంది. గత ఏడాది కేసానుపల్లి సమీపంలోని ప్రభుత్వ భూములను ఏపీఐఐసీకి అప్పగించి ఆటోనగర్‌కు శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ ఊసే ఎత్తడం లేదు. శ్రీకృష్ణచిత్రాలయ థియేటర్ వద్ద ఆర్‌యూబీ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన చాలా కాలం ఉంది. దీని వలన పట్టణంలోని ట్రాఫిక్ సమస్య చాలా వరకు తగ్గే అవకాశం ఉంది. జిల్లా కేంద్రంలో 200 పడకల ఏరియా వైద్యశాలను 350 పడకల సూపర్ స్పెషాలిటి వైద్యశాలగా ఉన్నతీకరించే ప్రతిపాదనను గత ప్రభుత్వం ఆమోదించింది. ఆసుపత్రిని ఉన్నతీకరించడంపై దృష్టిపెడితే జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. నిధులు అందుబాటులో ఉన్నా స్థలం సమస్యతో పనులు ప్రారంభం ఆలస్యమవుతుంది. దీనితో పాటు 75 పడకల క్రిటికల్ కేర్ సెంటర్‌కు స్థలం సమస్య వెంటాడుతోంది.

నియోజకవర్గాల అభివృద్ధికి ప్రతిపాదనలు ఇవ్వండి



సమావేశమైన మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, ఎమ్మెల్యేలు, అధికారులు

నరసరావుపేట: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలిసారి జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గాల పరిధిలో అభివృద్ధి అవసరాలు, అవకాశాలపై ప్రతిపాదనలను అందించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఎంపీ, ఎమ్మెల్యేలను కోరారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధుల కోరిక మేరకు నియోజకవర్గ సమస్యలు చర్చించేందుకు సీఎం పర్యటన అనంతరం జనవరి 4న డీఆర్సీ సమావేశం నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు. జిల్లాలో పర్యాటక అభివృద్ధి విషయమై అటవీ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని పలువురు ఎమ్మెల్యేలు కోరారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు , యరపతినేని శ్రీనివాసరావు, కన్నా లక్ష్మీనారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గుంటూరు డీఆర్‌ఎంగా లిల్లీ పాండే

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కేంద్ర సాంస్కృతిక విభాగంలో డెప్యూటేషన్‌పై ఉన్న లిల్లీ పాండేను గుంటూరు డీఆర్‌ఎంగా నియమిస్తూ రైల్వే శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 26న గుంటూరు డీఆర్‌ఎంగా రాయపూర్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆనంద్ మధుకర్‌ను నియమించిన రైల్వే శాఖ ఆ ఉత్తర్వులను తాజాగా రద్దు చేసి లిల్లీ పాండేను నియమించింది. ప్రస్తుత డీఆర్‌ఎం రామకృష్ణను ఎక్కడకు బదిలీ చేస్తారన్న విషయం ఆసక్తిగా మారింది.

ఎస్సీ వర్గీకరణ వన్‌మెన్ కమిషన్‌కు భారీగా వినతులు



కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు సమస్యను వివరిస్తున్న రెల్లి కులస్తులు

అభిప్రాయాలు తెలియజేసిన 1200 మంది

గుంటూరు వెస్ట్/నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వన్‌మెన్ కమిషన్‌కు భారీగా వినతులు వచ్చాయి. వివిధ ఎస్సీ ఉపకులాలకు చెందిన సుమారు 1200 మంది తమ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా అందించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వన్‌మెన్ కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రా, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ్, ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో అభిప్రాయాల సేకరణ జరిగింది. అధికంగా మాల సంఘాల నుంచి ఎక్కువ వినతులు వచ్చాయి. ఎస్సీ ఉపకులాల నుంచి కూడా దళిత నాయకులు వినతులు అందించారు. వినతుల స్వీకరణకు కలెక్టరేట్‌లో పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. కొందరు నాయకులు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా పాయింట్ వద్ద బహిరంగంగానే తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

న్యాయం చేయండి



మేము ఎస్సీ ఉపకులంలో ఉన్నాం. ఆశించిన స్థాయిలో రిజర్వేషన్లు అందడం లేదు. ఫలితంగా తరతరాలుగా పేదరికంలో మగ్గుతున్నాం. కమిషన్ సమగ్ర విచారణ జరిపి మా కులానికి న్యాయం చేయాలి.

– వనం నాగేశ్వరరావు, ఆల్ ఇండియా బుడగజంగం ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్

ప్రభుత్వాలు చేస్తున్న కుట్ర



ప్రభుత్వాలు దళితుల మధ్య చిచ్చుపెడుతున్నాయి. ఇంతకాలం అందరూ అభివృద్ధి చెందాం, చెందుతున్నాం. ఇప్పుడు ఈ వర్గీకరణ నేపథ్యంలో మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టేందుకు యత్నిస్తున్న స్వార్థ పరుల కుట్రను దళిత నాయకులు గుర్తించాలి.

– ఈమని చంద్రశేఖర్, జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు

క్లుప్తంగా

డాక్టర్ నరేంద్రరెడ్డి సేవలకు ప్రత్యేక గుర్తింపు



గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అభివృద్ధికి గుర్తింపు తీసుకొచ్చేందుకు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి అందించిన సేవలు అభినందనీయమని ఐఎంఏ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఆర్వీ అశోకన్, డాక్టర్ అనిల్ కుమార్ జె నాయక్ పేర్కొన్నారు. ఐఎంఏ జాతీయ ఉత్తమ కార్యదర్శిగా సీనియర్ జాయింట్ రిప్లేస్మెంట్ సర్జన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి అవార్డు అందుకున్నారు. 2023–2024 సంవత్సరానికి గాను గుంటూరు బ్రాంచిని అన్ని విభాగాలలో ఉత్తమ పనితీరు కనపరిచేలా తీర్చిదిద్దినందుకు గాను డాక్టర్ బూసిరెడ్డికి ఈ అవార్డు దక్కింది. ఇటీవల హైదరాబాదులో రెండు రోజులు పాటు జరిగిన ఐఎంఏ జాతీయ సమావేశాల్లో భాగంగా శనివారం రాత్రి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

విభిన్న ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోవాలి

నరసరావుపేట: విభిన్న ప్రతిభావంతులు డీజిల్, పెట్రోల్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జి.సువార్త కోరారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏదైనా సొంతంగా వ్యాపారం, గుర్తింపు కల్గిన ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తూ మోటరైజ్డ్ మూడు చక్రాల వాహనం కల్గిన దివ్యాంగులు సబ్సిడీ కోసం దరఖాస్తు చేయాలని కోరారు. వారికి అయ్యే ఖర్చులో 50 శాతం రాయితీ రీయింబర్స్ చేయబడుతుందన్నారు. రెండు హార్స్ పవర్ ఇంజన్ సామర్థ్యం కల్గిన వాహనానికి నెలకు 15 లీటర్లు, దీనికంటే ఎక్కువ సామర్థ్యంగల ఇంజన్ గల బండికి నెలకు గరిష్టంగా 25 లీటర్లు వరకు రాయితీ పరిమితి ఉంటుందన్నారు. ఇంధన కొనుగోలు బిల్లులు, దరఖాస్తు ఫారం, సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, బ్యాంకు పుస్తకం, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, పనిచేసే సంస్థ ధృవీకరణ పత్రాలను గుంటూరు బృందావన్ గార్డెన్ నాల్గవ లైనులోని కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

డాక్టర్ చైతన్యకు అవార్డు

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన ప్రముఖ ఆర్థోస్కోపిక్ సర్జన్ డాక్టర్ ఘంటా చైతన్యకు టైమ్స్ ఐకాన్స్ ఆఫ్ హెల్త్ కేర్- 2024 అవార్డు లభించింది. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ చేతుల మీదుగా విజయవాడలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డాక్టర్ చైతన్య అవార్డు అందుకున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా వారు క్రీడల్లో గాయపడిన వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్థోస్కోపీ ఆపరేషన్లు చేస్తున్న డాక్టర్ చైతన్యను ఆర్థోస్కోపీ అండ్ స్పోర్ట్స్ మెడిసిన్ విభాగంలో అవార్డుకు ఎంపిక చేశారు. పలువురు ఆర్థోపెడిక్ సర్జన్లు, ఐఎంఏ వైద్యులు అభినందనలు తెలిపారు.

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

- ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి
- ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- బందోబస్తుకు 1120 మంది సిబ్బంది



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి

నరసరావుపేట రూరల్: యల్లమందలో సీఎం చంద్రబాబు పర్యటనకు 1120 మంది పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి వెల్లడించారు. ప్రజావేదిక పేదల సేవలో సభలో పాల్గొనేందుకు మంగళవారం సీఎం చంద్రబాబు యల్లమందలో పర్యటించనున్నారు. అక్కడ సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులకు, సిబ్బందికి గ్రామంలోని కల్యాణ మండపంలో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో కలిసి ఐజీ దిశా నిర్దేశం చేశారు. బందోబస్తు విధుల్లో ముగ్గురు అడిషనల్ ఎస్పీలు, ఏడుగురు డీఎస్పీలు, 30 మంది సీఐలు, 99 మంది ఎస్ఐలు, 177 మంది ఏఎస్ఐలు, 320 మంది కానిస్టేబుల్స్, 44 మంది మహిళా కానిస్టేబుల్స్, 23 మంది మహిళా హోంగార్డ్‌లు, 281 మంది హోంగార్డులు, 136 మంది ఏఆర్, స్పెషల్ ఫోర్స్ సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది సమిష్టిగా విధులు నిర్వహించాలని చెప్పారు. వీవీఐపీలు, వీఐపీలు సంచరించే హెలీప్యాడ్, పింఛన్ల పంపిణీలో లబ్ధిదారుల ఇళ్ల వద్ద, కొదండ రామాలయం వద్ద, సభా ప్రాంగణం, కోటప్పకొండ రహదారి వెంట బందోబస్తు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొనే ప్రముఖులకు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కేటాయించిన పార్కింగ్ స్థలాలను వారికి తెలియజేయాలన్నారు. బందోబస్తు విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎవరైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం హెలీప్యాడ్ నుంచి సభా వేదిక వరకు కాన్వాయ్ ట్రైల్ రన్ నిర్వహించారు.

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే

సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావులు పరిశీలించారు. హెలిప్యాడ్, సభాస్థలి తదితర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధులత, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: అనంతపురం పోలీసుల అనుచిత ప్రవర్తనతో పోలీస్ స్టేషన్‌లోనే సీనియర్ న్యాయ వాది శేషాద్రి గుండెపోటుతో మరణించారని, దీనికి కారకులైన పోలీసుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జ్యూడీషియల్ విచారణకు ఆదేశించాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్ కుమార్ అన్నారు. గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా సోమవారం సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలో ఉన్న నాలుగు న్యాయస్థానాల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ముందుగా కోర్టు ఆవరణలోని న్యాయదేవత విగ్రహం వద్దకు చేరుకొని తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయ వాదుల్లో ఒకరు అయిన బి.వి శేషాద్రి అక్కడ ఉన్న మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తన క్లయింట్ తరుపున సివిల్ వివాదంలో ఒక కేసును డీల్ చేస్తున్నారన్నారు. మీకు చట్టపరంగా ఆ హక్కు లేదని క్లయింట్ తరుపున నోటీసు పంపారన్నారు. ఆ అక్కసుతో సీఐ పదేపదే న్యాయవాదిని స్టేషన్‌కు పిలవగా ఆ న్యాయవాది తన జూనియర్ న్యాయవాదులతో కలసి స్టేషన్‌కు వెళ్లగా సీఐ జూనియర్ న్యాయవాదులను లోపలకి అనుమతించకుండా కేవలం శేషాద్రినే అనుమతించి తన చాంబర్‌లోకి సెల్‌ఫోన్ కూడా అనుమతించకుండా ఆ న్యాయవాదిని విచారణ పేరుతో గట్టిగా మాట్లాడటంతో అక్కడే న్యాయవాది శేషాద్రి గుండెపోటుతో మరణించాడన్నారు. కనీసం మానవత్వం కూడా చూపకుండా సీఐ జూనియర్ న్యాయాదులను పిలిచి మీ సీనియర్ న్యాయవాదికి ఫిట్స్ వచ్చాయి అని అక్కడి నుంచి తరలించగా అప్పటికే 30 నిమిషాల క్రితమే న్యాయవాది శేషాద్రి మరణించారని వైద్యులు తెలిపారన్నారు. ఈ సంఘటనకు కారకులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని, న్యాయవాదుల పరిరక్షణ చట్టంను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకురావాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పిన్నమనేని పాములయ్య, చిలుక చంద్రశేఖర్, పూజల వెంకట కోటయ్య, అనుమోలు జయరాం, బి.ఎల్.చిన్నయ్య, దివ్వెల శ్రీనివాసరావు, కన్నెధార హనుమయ్య, కొల్లా వెంకటేశ్వరరావు, రాజశేఖరుని గోపాల కృష్ణమూర్తి, మద్దినేని వెంకట చలపతిరావు, కాకర్ల హరిబాబు, రాజవరపు నరసింహారావు, మన్నెం వెంకటేశ్వరరావు, తవ్వా హరనాథ్, సురే.వీరయ్య, నరిశేటి వేణుగోపాల్, జూపల్లి శేషయ్య, బాదినేడి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

హిందూ మాదిగ.. మాల ఎలా అయ్యారు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

- సమగ్ర విచారణ జరిపి తుది నివేదికను ప్రభుత్వానికి ఇవ్వాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): రాష్ట్ర ప్రభుత్వం సచివాలయంలో ఉంచిన ఎస్సీల కులాల నోటిఫికేషన్ తప్పుల తడకగా ఉందని దీనిపై సమగ్ర విచారణ జరిపాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టరేట్ ఎస్ఆర్ శంకరన్ హాల్‌కు సోమవారం వచ్చిన వన్‌మెన్ కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు మందకృష్ణ ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా ఇంటి పేరు మంద.. మంద అనే ఇంటి పేరు రాష్ట్రంలో ఎక్కడైన మాదిగ కులంలో ఉంటుందని, కాని కొన్ని ప్రాంతాల్లో మంద ఇంటి పేరు ఉన్నవారు మాల అని నోటిఫై చేశారని, అదే విధంగా కొని ప్రాంతాల్లో మాదిగలకు హిందూ మాదిగ అని ఉంటుంది, కాని మాదిగ క్రిస్టియన్ అని నోటిఫై చేశారని ఆరోపించారు.

దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీస్ పోరాడుతూనే ఉందని, వర్గీకరణ అంశం చివర దశకు వచ్చిన సమయంలో మాదిగల జాబితా అంతా తప్పుల తడకగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఒక సామాజిక వర్గం కింద స్థాయి నుంచి పై స్థాయి వరకు వారే ఉండటంతో మాదిగలను తగ్గించి చూపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై వన్‌మెన్ కమిషన్ పూర్తిగా విచారణ చేపట్టి మాదిగలకు, ఎస్సీలోని ఉప కులాలకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు.

ఐక్యత అనేది బూటకమే ...

వర్గీకరణ చేయాలనేది మాదిగల కోసమే కాదని, ఎస్సీల్లోని అట్టడుగు కులాల వారికి కూడా అందాలనే ఉద్దేశంతో మేం వర్గీకరణ చేయాలని కోరుతున్నామని కృష్ణమాదిగ చెప్పారు.

జార్ఖండ్ జట్టు ఆధిక్యం

మంగళగిరి: నగర పరిధిలోని అమరావతి టౌన్‌షిప్‌లో నిర్వహిస్తున్న విజయ్‌మర్చంట్ ట్రోఫీలో జార్ఖండ్ జట్టు ఆధిక్యం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జమ్ము, కశ్మీర్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 55.01 ఓవర్లలో 129 పరుగులకు ఆలౌటు అయింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన జార్ఖండ్ జట్టు 85.1 ఓవర్లలో ఏడు వికెట్లు నష్టపోయి 365 పరుగులు చేసింది. వాగ్స్ 108 పరుగులు చేయగా జార్ఖండ్ బౌలర్ అర్జున్ ఆరు వికెట్లు తీసి రాణించాడు.

యార్డుకు 55,760 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 55,760 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 50,214 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,300 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.7,500 నుంచి రూ.14,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.8,000 నుంచి రూ.16,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

కలెక్టర్ నాగలక్ష్మి



వర్చువల్‌గా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి అధికారులతో వర్చువల్‌గా మాట్లాడుతూ గ్రౌండ్ లెవల్ పూర్తయిన ఇళ్ల లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా బ్యాంకు లింకేజి రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో ఏర్పడే చిన్న చిన్న సమస్యలను అధికారులు అప్పటికప్పుడే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతుల కల్పనను సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని తెలిపారు. పోషణ్ వాటికలు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకు రావాలని పేర్కొన్నారు. జిల్లాలో గ్రామ, వార్డు, సచివాలయ సిబ్బంది హౌస్‌హోల్డ్ సర్వే వేగవంతం చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రతిరోజూ ఆన్‌లైన్ అటెండెన్స్ వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సంక్రాంతి నాటికి రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం ఉదయం నుంచి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎలాంటి అసౌకర్యం లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాద్, సీపీఓ శేషశ్రీ, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, డీపీఓ సాయికుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూకు ఆరు పతకాలు

సౌత్ జోన్ యువజన ఉత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విజేతలతో యూనివర్సిటీ అధికారులు

ఏఎన్‌యూ: ఆల్ ఇండియా యూనివర్సిటీ (ఏఐయూ) నిర్వహించే అంతర విశ్వవిద్యాలయాల 38వ సౌత్ జోన్ యువజన ఉత్సవాల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆరు పతకాలు సాధించిందని యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్.మురళీమోహన్ తెలిపారు. ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించిన యువజనోత్సవాలలో 24 విశ్వవిద్యాలయాలు పాల్గొన్నాయి. వీటిల్లో ఆరు పతకాలను వర్సిటీ సాధించినట్లు వివరించారు. వాటిల్లో స్పాట్ ఫొటోగ్రఫీలో రెండో స్థానం, మెహందీలో మూడో స్థానం, మైమ్‌లో మూడవ స్థానం, ఇన్‌స్టా లేషన్‌లో మూడో స్థానం, కార్టూనింగ్‌లో మూడో స్థానం, కొలీజ్ లో మూడో స్థానం పొందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీకి పతకాలు సాధించిన విద్యార్థి కళాకారులను ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధర రావు, ఇన్‌చార్జి రెక్టర్ కె.రత్నషీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ జి.సింహాచలం అభినందించారు.

సావిత్రీబాయి పూలే ప్రతిభా అవార్డుకు ఎంపికైన అమరేశ్వరి

గుంటూరు ఎడ్యుకేషన్: దక్షిణాది ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపక సంస్థ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డు-2025కు గుంటూరు నగరానికి చెందిన భౌతికశాస్త్ర అధ్యాపకురాలు వంటల అమరేశ్వరి ఎంపికయ్యారు. ఆమె స్వస్థలం దాచేపల్లి కాగా, గుంటూరులోని వివిధ కళాశాలల్లో భౌతికశాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తూనే నీట్, ఐఐటీ, బిట్‌శాట్, ఎంసెట్ పోటీ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణనిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఏఎన్‌యూ భౌతికశాస్త్ర విభాగంలో నానో సైన్స్‌పై పరిశోధనలు చేస్తున్నారు. తన పరిశోధన అంశాన్ని జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో ప్రదర్శించి, విద్యావేత్తల ప్రశంసలు అందుకున్నారు. గుంటూరులో దశాబ్ద కాలంగా ఫిజిక్స్ క్రియేటివ్ అకాడమీ పేరుతో శిక్షణ సంస్థను నిర్వహిస్తున్నారు. జనవరి 19న గుంటూరు నగరంలో ప్రదానం చేయనున్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



జిల్లా కోర్టు ఆవరణలో మౌన ప్రదర్శన చేస్తున్న న్యాయవాదులు

నగరంపాలెం: మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పీటీసీ, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా పనిచేసిన సీనియర్ న్యాయవాది సుదర్శన్‌రెడ్డిపై దాడిని నిరసిస్తూ సోమవారం ది గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ మేరకు బార్ అధ్యక్షుడు కాసు వెంకట రెడ్డి మాట్లాడుతూ లాయర్ సుదర్శన్‌రెడ్డిపై దాడి చేసి, ఆయనే దాడి చేసినట్లు కట్టు కథ అల్లారని అన్నారు. ఈ ఘటనలో ఆయనతో పోలీసులు వ్యవహరించిన తీరు దారుణమని పేర్కొన్నారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా ప్రాక్టీస్ ఉన్న న్యాయవాది సుదర్శన్ రెడ్డి అని అన్నారు. ఆయన ప్రతిభను గుర్తించి రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా నియమించారని అన్నారు. చొక్కా పట్టుకుని లాక్కెళ్లిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని పలువురు న్యాయవాదులు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, మాజీ కార్యదర్శులు మంజుల, శ్యామల పాల్గొన్నారు.

నేడు వినతిపత్రాలు..

పొన్నూరులో న్యాయవాది బి.ప్రకాష్‌పై పోలీసుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ హాల్‌లో సమావేశమయ్యారు. ఈ మేరకు కార్యచరణను రూపొందించారు. మంగళవారం గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాలు అందించాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం కోర్టు ఆవరణలో మౌన ప్రదర్శనగా వెళ్లి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, మాజీ అధ్యక్షులు శాంతకుమార్, సురేష్ పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

తొలిరోజు అర్హత సాధించిన 166 మంది అభ్యర్థులు



పరుగుపందెంలో పాల్గొన్న అభ్యర్థులు

నగరంపాలెం: జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీస్ కానిస్టేబుళ్ల అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు సోమవారం మొదలయ్యాయి. తెల్లవారుజామున ఐదు గంటల నుంచి గ్రౌండ్స్‌లోకి అనుమతించడంతో, ఎటువంటి తోపులాట లేకుండా ఒకరి తర్వాత ఒకర్ని లోనికి పంపించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, పలువురు పోలీసు అధికారులు దగ్గరుండి ఏర్పాట్లను, దేహదారుఢ్య పరీక్షలను పర్యవేక్షించారు. తొలిరోజు దేహదారుఢ్య పరీక్షలకు 290 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 36 మందికి సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనుదిగారు. 290 మందిలో 36 మందిని అనర్హులుగా ప్రకటించగా, మిగతా 254 మందికి శరీర కొలత పరీక్షలు(పీఎంటీ) నిర్వహించారు. వీరిలో 39 మందికి ఛాతి, ఎత్తు కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. 254 మందిలో 39 మంది అనర్హులు కాగా, 215 మందికి 1,600 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా, పోటాపోటీగా పరుగెత్తారు. వీరిలో 32 మంది అనర్హులు కావడంతో మిగతా 183 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. 183 మందిలో ఒకరూ వైదొలగా, 182 మందికి 100 మీటర్ల పరుగు పందెం పోటీ నిర్వహించారు. వీరిలో 74 మంది అర్హత సాధించగా, 108 మంది అనర్హత పొందారు. 183 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా, వారిలో 166 మంది అర్హత సాధించగా, 17 మంది అనర్హత పొందారు. 254 మంది అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 166 మంది అర్హత సాధించగా, 88 మంది అనర్హత పొందారు.

ఐసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన యేల్చూరి



నగరంపాలెం: ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్(ఐసీసీ) నూతన అధ్యక్షుడిగా యేల్చూరి వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 28న నిర్వహించిన చాంబర్ ఎన్నికల్లో ఆయన ప్యానెల్ గెలుపొందింది. సోమవారం జిన్నాటవర్ కూడలిలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో యేల్చూరి వెంకటేశ్వర్లు, ఆయన ప్యానెల్ సభ్యులు బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయనకు పలువురు పుష్పగుచ్ఛాలు అందించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, టీడీపీ నాయకులు కొనకళ్ల సత్యం, షేక్ షౌకత్ పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత



ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన గురితప్పిన బాణం నటులకు బహుమతి అందజేస్తున్న లలిత కళానికేతన్ కమిటీ సభ్యులు

- తక్కెళ్లపాడులో ముగిసిన జాతీయ స్థాయి ఆహ్వాన నాటికల పోటీలు
- ప్రథమ ప్రదర్శన గురితప్పిన బాణం ఎంపిక

పెదకాకాని: కళలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్టేట్‌బ్యాంక్ ఏజీఎం ఎంఎస్ఎస్ శర్మ అన్నారు. పెదకాకాని మండలం తక్కెళ్లపాడులో డాక్టర్ కాసరనేని సదాశివరావు కళాపరిషత్ ఆధ్వర్యంలో లలిత కళానికేతన్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న 14వ జాతీయ స్థాయి ఆహ్వాన పరిషత్ నాటికల పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. న్యాయ నిర్ణేతలు వ్యవహరించిన నూతలపాటి కాళిదాసు, పెద్ది రమేష్‌బాబు, పిన్నమనేని తిరుపతయ్య విజేతల వివరాలు వెల్లడించారు. పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా రసఝురి పొన్నూరు వారి గురితప్పిన బాణం(ప్రథమ), అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇది అతని సంతకం(ద్వితీయ), అమృతలహరి ఆర్ట్స్ థియేటర్ వారి నాన్నా నేనొచ్చేస్తా(తృతీయ) స్థానాల్లో నిలిచాయి. అలానే ఉత్తమ నటుడు కృష్ణమూర్తి పాత్రదారి ఎస్.రవీంద్రరెడ్డి(ఇది అతని సంతకం), ఉత్తమ దర్శకత్వం అమృతలహరి(నాన్నా నేనొచ్చేస్తా), ఉత్తమ రచన పిన్నమనేని మృత్యుంజయరావు(గురితప్పిన బాణం), ఉత్తమ నటి సావిత్రి పాత్రధారి ఎస్.అమృతవర్షిణి(నాన్నా నేనొచ్చేస్తా) ఉత్తమ బాల నటి శ్వేత పాత్రధారిణి ఎస్‌యస్మిత(నా శత్రువు), ఉత్తమ సంగీతం కె సాయితేజ, ఉత్తమ ఆహార్యం జి.శ్రీధర్, ఉత్తమ లైటింగ్ ఫణి(గురితప్పిన బాణం)లను ఎంపిక చేశారు. అలానే ఉత్తమ సహాయ నటులు, జూరి ప్రదర్శలు, ఉత్తమ రంగాలంకరణ, జూరి నటులను ఎంపిక చేసి అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

పెదకాకానిలో కారు బీభత్సం

- మహిళకు గాయాలు
- ఏడు వాహనాలు ధ్వంసం



పెదకాకాని: నిత్యం రద్దీగా ఉండే పెదకాకాని సెంటర్లో కారు దూసుకు రావడంతో స్థానికులు పరుగులు తీశారు. విజయవాడకు చెందిన భార్యాభర్తలు పెదకాకాని బాజీ బాబా దర్గాకు బయలుదేరారు. పెదకాకాని చేరుకుని ఫుడ్ బిడ్జి వద్ద వెనిగండ్ల వెళ్లే రహదారిలోకి వెళుతున్న క్రమంలో సోమవారం రాత్రి కారు దూసుకొచ్చి సెంటర్లో ఆపి ఉన్న ఏడు బైకులను ఢీకొంది. ఈ ఘటనలో పక్కనే ఉన్న పెదకాకాని పాతూరు ప్రాంతానికి చెందిన హుస్సేన్ బికి గాయాలయ్యాయి. బాధితురాలని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కారు నడిపిన వ్యక్తిని స్థానికులు నిలదీశారు. కారులో ఉన్న మహిళ స్థానికులతో వాదనకు దిగడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కారులో ఉన్న వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.